
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 40.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 10 మే 2025

వృథా కాదు నీ మరణం

ఛాయాపురంలో ప్రజావేదికకు హాజరైన ప్రజలు, ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు





మీ రుణం తీర్చుకుంటా

గడువులోగా హంద్రీనీవా పూర్తి చేయాలి

అభివృద్ధిలో అనంతను మూడో స్థానానికి చేర్చాలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఛాయాపురంలో వైడెనింగ్ పనుల పరిశీలన

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తాం



వేదికపై మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

గుంతకల్లు/ఉరవకొండ, మే9(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని, మీ రుణాన్ని తీర్చుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. హంద్రీనీవా వైడెనింగ్ పనులను పరిశీలించడానికి వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామానికి ముఖ్యమంత్రి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజావేదికను నిర్వహించారు. తొలుత పాకిస్థాన్‌తో యుద్ధంలో అసువులు బాసిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దేశాన్ని కాపాడగలిగే నేత నరేంద్ర మోదీ అని తాను అమరావతి సభలో వ్యాఖ్యానించానని, పాక్‌తో యుద్ధంలో ఆయన సాధిస్తున్న విజయాలు అందుకు నిదర్శనమన్నారు. అభివృద్ధిలో అనంతపురం జిల్లా ప్రస్తుతం 13వ స్థానంలో ఉందని, దాన్ని 3వ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాకు వరాలు..

ప్రజావేదిక సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాకు వరాల జల్లు కురిపించారు. ఉరవకొండకు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేస్తామని, అయితే కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత మంత్రి కేశవ్‌దేనని సీఎం చమత్కరించారు. పొట్టిపాడుకు దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి నిధులు, కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జీడీపల్లి నిర్వాసితులకు వెంటనే పరిహారం అందిస్తామన్నారు. 50 వేల ఎకరాల మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామన్నారు. జీడీపల్లి, భైరవానితిప్ప, పేరూరు సహా ప్రాజెక్టులన్నింటికీ ప్రాధాన్యం ఇస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మందలింపు

ప్రజావేదికలో ఛాయాపురం విలేజ్ ఎకనామిక్ ప్రొఫైల్‌ను చదివిన పంచాయతీ కార్యదర్శి రామయ్యను ముఖ్యమంత్రి ప్రశంసిస్తూనే, సమగ్ర పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసినందుకు మందలించారు. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే పని చేపట్టనందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత నిర్లక్ష్యమైతే ఎలా అన్ని ప్రశ్నించారు. ఇకపై ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బంగారు కుటుంబాలను ఆదుకుంటాం

ఎంపికైన బంగారు కుటుంబాలన్నింటినీ అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రజావేదికలో బంగారు కుటుంబాలకు ఎంపికైన వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఛాయాపురంలో బంగారు కుటుంబం కింద ఎంపికైన పార్వతితో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. పార్వతి భర్త బేల్దారి పనులు చేస్తూ కరెంటు షాక్‌కు గురై కిందపడి పనిచేయలేని పరిస్థితికి చేరుకున్నాడు. దీంతో నలుగురు పిల్లలను, భర్తను పోషిస్తున్న పార్వతి తన కష్టాలు సీఎంకు (మిగతా 6వ పేజీలో...)

సిందూరం రాలిన
మంచు కొండల దిగువన
శివతాండవమాడిన
తండా వీరుడా..!

ఆ అర్ధరాత్రి..
దేశమాత ఒడిలో ఒరిగిపోతూ..
అమ్మ.. నాన్న గురించి..
ఆందోళన చెందావటగా..!

అమ్మ కడుపున పుట్టింది..
నువ్వొక్కడివే కావచ్చుగాని..
భారతమ్మ కడుపున..
కోటాను కోట్లుగా
కలిసే పుట్టాంగదా..!

పసితనంలో నువ్వెక్కింది..
నాన్న భుజంపై మాత్రమేకావచ్చు..!
ఇప్పుడు చూడు..
నిన్ను మోసేందుకు
ఎన్నెన్ని భుజాలు
పోటీ పడుతున్నాయో..!
ఇక దిగులెందుకు..?

నువ్వు మెలేసిన సీమ మీసం..
సరిహద్దుల్లో వీర ఖడ్గమై..
నిటారుగా నిలబడే ఉంది..!

నీ జ్ఞాపకాలు
కాశ్మీర తీరాల నుంచి
కన్యాకుమారి అంచు వరకూ
గాలి తెమ్మెరలై వీస్తూనే ఉంటాయి
మువ్వన్నెల జెండాను..
రెపరెపలాడిస్తూనే ఉంటాయి..!
వృథా కాదు నీ మరణం..!



అగ్ని వీరుడై.. శతఘ్ని శూరుడై..



శత్రుమూకలను చెండాడి.. భరతమాత ముద్దుబిడ్డ వీరమరణం

రణభూమిలో ఒరిగిన జవాను మురళీనాయక్

ఊరూరా నివాళులు.. కొవ్వొత్తుల ర్యాలీలు..

6



అనంతపురంలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఆగండి సర్.. ఫొటో తీసుకుంటా..



దండాలు.. విజిల్లు...



బంగారు కుటుంబంతో సీఎం చంద్రబాబు, వేదికపై మంత్రి కేశవ్, అధికారులు

నేడు అంకురార్పణ

పెన్నహోబిలానికి ఉత్సవమూర్తులు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

ఉరవకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేళయింది. స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు.బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందురోజు మండలంలోని ఆమిద్యాల నుంచి పెన్నహోబిలానికి చేర్చడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆమిద్యాలలోని పెన్నోబులేశుని ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెన్నహోబిలానికి తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులకు ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కోసం అన్ని ఏర్పాటు చేసినట్లు ఈఓ రమేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాగంణంలో చలువ పందిళ్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి నిధులతో పూడికతీత



జిల్లా మత్స్యశాఖ అధికారితో చర్చిస్తున్న డ్వామా ఏపీడీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం నిధులతో జిల్లాలో చేపల పెంపకం చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డితో ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ఈ విషయమై సమావేశమయ్యారు. జిల్లాలో ఎన్ని చెరువుల్లో చేపల పెంపకం చేపడుతున్నారు, ఎన్నింటిలో పూడికతీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉందనే అంశాలపై చర్చించారు. మొదటి విడతలో ఎంపీఆర్ వద్ద ఉన్న చేపల పెంపకం గుంతల్లో పూడికతీత పనులు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

బోరుగడ్డ కేసు 23కు వాయిదా

అనంతపురం క్రైం, మే 9(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బోరుగడ్డ అనిల్‌పై నమోదైన కేసు విచారణను కోర్టు ఈ నెల 23కు వాయిదా వేసింది. జిల్లా జైలు అధికారులు అనిల్‌ను శుక్రవారం వీడియో కాల్ ద్వారా కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ కేసును ఎక్సైజ్ కోర్టు నుంచి ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేసిన నేపథ్యంలో న్యాయవాదిని మరోసారి నియమించుకోవాలనే నిబంధన ఉంది. దీంతో బోరుగడ్డ తరఫున న్యాయవాది బి.నారాయణరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.

గ్రేడ్-3 కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏళ్లుగా వేచి చూస్తున్న గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు 45 మందికి ఎట్టకేలకు ఉద్యోగోన్నతి లభించింది. వారికి గ్రేడ్-2 కార్యదర్శులుగా ప్రమోషన్ కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని డీపీఓని ఆదేశించారు. ఏసీబీ, విజిలెన్స్ ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్న వారికి ఉత్తర్వులు వర్తించవన్నారు. అందుకు అనుగుణంగా డీపీఓ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేయడానికి కసరత్తు ప్రారంభించింది. జోనల్ పరిధిలో ఉద్యోగోన్నతులు చేపట్టడంతో పలువురిని పక్క జిల్లాలకు సైతం కేటాయించారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పే రివిజన్ కమిషన్(పీఆర్సీ)ను వెంటనే నియమించి, ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటే శ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని కృష్ణకళా మందిర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఎలాంటి సమస్యలు పరిష్కరించలేదన్నారు. పీఆర్సీని నియమించాల్సి ఉన్నా పట్టించుకోలేద న్నారు. అలాగే బకాయి ఉన్న డీఏలు ప్రకటించలేదని, అరియర్స్ బిల్లులు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీ మేరకు చట్టప్రకారం ఇవ్వాల్సిన వాటిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అమరావతి జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటరాజేష్, జిల్లా అమరావతి జేఏసీ చైర్మన్ దివాకర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, నాయకులు మల్లరాయుడు, శివానందరెడ్డి,సంతోష్‌గౌడు,తలారిపెద్దయ్య, జయరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వినయ్ రమేష్, శ్రీసత్యసాయి జిల్లా నాయకులు మైనుద్దీన్, మధునాయక్, జీవైపీ రావు తదితరులు పాల్గొన్నారు.



పాతూరు మసీదు ముందు జెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

ఉగ్రవాదం అంతం కావాలి..!

అనంతపురం కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని భారతీయ జెండాలతో ముస్లింలు ప్రదర్శనలు చేపట్టారు. శుక్రవారం ఐఎంఎం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాతూరు మస్జిద్ ముందు మతపెద్దలతోపాటు ముస్లింలు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ భారతదేశానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ... ఉగ్రవాదులు ఎక్కడున్నా వారిని అంతం చేయాలనీ, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారికి సైతం గట్టిగా బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ షబ్బీర్, తాజుద్దీన్, సమీవుల్లా, జాకీర్ బాషా, బషీర్, సులేమాన్, షరీఫ్, మసూద్, మహ్మద్ షరీఫ్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు సన్నద్ధం

- శారదాస్కూల్‌లో ప్రత్యేక కేంద్రం
- 16 వేలకుపైగా టీచర్ల సీనియారిటీ జాబితా సిద్ధం

6



కడుపు కోత.. తల్లి జ్యోతీబాయి

చిన్నప్పట్నుంచీ ఒకటే లక్ష్యం.. సైన్యంలో చేరాలని. వేరే ఉద్యోగం వద్దన్నాడు. సైనికుడినే అవుతానన్నాడు. ఎంతో కష్టపడ్డాడు. కిలోమీటర్లు పరుగెత్తాడు. ఆఖరుకు అనుకున్నది సాధించాడు. అగ్నివీర్‌కు ఎంపికై, సైన్యంలో చేరాడు. భరతమాత రక్షణ కోసం వీరోచిత పోరాటం చేశాడు. శత్రువులను చెండాడి.. రణభూమిలో వీరమరణం పొందాడు.. గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్. భారత్-పాక్ యుద్ధంలో మురళీనాయక్ వీరోచిత పోరాటానికి దేశం సెల్యూట్ చేస్తోంది. ఊరూరా నివాళులు అర్పిస్తున్నారు. కొవ్వొత్తుల ర్యాలీలు చేస్తున్నారు.



అగ్ని వీరుడై.. శతఘ్ని శూరుడై...

శత్రుమూకలను చెండాడి..

భరతమాత ముద్దుబిడ్డ వీరమరణం

రణభూమిలో జవాను మురళీనాయక్ మృతి

ఊరూరా నివాళులు.. కొవ్వొత్తుల ర్యాలీలు..

హిందూపురం, మే 9(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో దేశ సరిహద్దులో గురువారం రాత్రి జరిగిన భీకర పోరులో గోరంట్ల మండలానికి చెందిన అగ్నివీర్ జవాను మురళీనాయక్ (25) వీరమరణం పొందారు. గోరంట్ల మండలం గడ్డంతండా పరిధిలోని కళ్లితండాకు చెందిన శ్రీరాములునాయక్ జ్యోతీబాయి దంపతుల ఏకైక కుమారుడు మురళీనాయక్. 2000 అక్టోబరు 23న జన్మించారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. అమ్మ పుట్టినిల్లయిన సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు తండాలో అమ్మమ్మ, తాత శాంతిబాయి, నానేనాయక్ వద్ద పెరిగారు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో చదివారు. చిన్నప్పట్నుంచి ఆర్మీలో చేరాలని ధ్యేయం పెట్టుకున్నాడు. 2025 నవంబరులో అగ్నివీర్‌కు ఎంపికై సైన్యంలో చేరారు.

ఊరికొస్తే రోజంతా ఆటలే..

మురళీనాయక్ సెలవు తీసుకుని సొంతూరు కళ్లితండాకు వస్తే స్నేహితులతో కలిసి రోజంతా క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, టెన్నిస్, ఆడేవారు. ఉద్యోగం రాకముందు కళ్లితండా నుంచి పుట్టపర్తి క్రాస్ వరకు సుమారు 20కి.మీ. దూరం రన్నింగ్ చేసేవారు. ఎలాగైనా ఆర్మీలో చేరాలనేదే ధ్యేయం. ఏదైనా శుభకార్యం జరిగితే సెలవుపై వస్తే అందరితో కలుపుకుని ఉల్లాసంగా గడిపేవారు. మూడేళ్ల క్రితం తండాలో వినాయక నిమజ్జనం సందర్భంగా నృత్యం చేస్తూ స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. తండాలో మురళీనాయక్ ఒక్కరే సైన్యంలో పనిచేస్తున్నారు.



తల్లిదండ్రులతో..

వేరే ఉద్యోగం వద్దని..

డిగ్రీ పూర్తయిన తరువాత మురళీనాయక్‌కు వేరే ఉద్యోగం చేసుకోవాలని తల్లిదండ్రులతోపాటు అవ్వతాతలు చెప్పారు. అవసరమైతే డబ్బు కూడా ఖర్చుచేస్తామని చెప్పారు. అయినా ఆర్మీలోనే పనిచేయాలని వెళ్లారు. స్నేహితులు కూడా వేరే ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాలని చెప్పినా వారిమాట కూడా వినలేదు. ఇంకో ఏడాది ఆర్మీలో పనిచేసి స్వగ్రామానికి వస్తానని ఇటీవల స్నేహితులతో చెప్పారు.

విషాదంలో తండా

మురళీనాయక్ వీరమరణం పొందారని తెలియగానే ఒక్కసారిగా కళ్లితండాలో విషాదం అలుముకుంది. తండాలో ఏ ఒక్కరూ పనులకు వెళ్లకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్‌ను తలుచుకుంటూ రోజంతా గడిపారు. గురువారం రాత్రి మురళీనాయక్ బుల్లెట్ దెబ్బలతో వీరమరణం పొందారు. శుక్రవారం ఉదయం కమాండర్.. మురళీనాయక్ తల్లి జ్యోతీబాయికి ఫోన్ చేసి, విషయం చెప్పారు. దీంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయారు. చుట్టుపక్కలవారు వెళ్లి ఏం జరిగిందని ఆరాతీయగా.. ఆపరేషన్ సిందూర్‌లో మురళీనాయక్ మృతిచెందినట్లు తెలుసుకున్నారు.

తల్లిదండ్రులు, స్నేహితులతో చివరి మాటలు

గురువారం రాత్రి 7-8గంటల మధ్యలో తల్లిదండ్రులకు మురళీనాయక్ ఫోన్‌చేసి యోగక్షేమాలపై ఆరాతీశారు. తాను క్షేమంగా ఉన్నాననీ, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. స్నేహితుడు వినోద్‌నాయక్‌కు ఫోన్‌చేసి, భీకర యుద్ధం జరుగుతోందనీ, కాల్పులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. ఈ రాత్రి గడిస్తే తనకు పునర్జన్మేనన్నారు. తనకేమైనా జరిగితే అమ్మానాన్నలను బాగా చూసుకోవాలని వినోద్‌కు చెప్పారు. ధైర్యంగా ఉండాలని వినోద్ చెప్పాడు.

జాతరకు వచ్చిన తల్లిదండ్రులు

తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. అక్కడే చిన్న వ్యాపారం చేసుకుంటూ కూలి పనులకు వెళ్తుండేవారు. రెండేళ్ల క్రితం కళ్లితండాలో ఇల్లు కట్టుకున్నారు. మంగళవారం తండాలో జాతర ఉండడంతో శ్రీరాములునాయక్, జ్యోతీబాయి వచ్చి, ఇక్కడే ఉన్నారు.

ఎస్కేయూ గోల్డ్ మెడలిస్ట్

అనంతపురం సెంట్రల్: యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ ఎస్కేయూ గోల్డ్‌మెడలిస్ట్. ఎస్కేయూ అనుబంధ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ బీకామ్ పూర్తిచేసిన మురళీనాయక్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా బీ సర్టిఫికెట్ పొందారు. చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు, క్రీడల్లో చురుకైన పాత్ర పోషించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సాకే అంజనేయులు పర్యవేక్షణలో క్రీడాశిక్షణ పొందారు. సౌతిండియా యూనివర్సిటీస్ ఇంటర్నల్ టోర్నమెంట్‌లో మురళీనాయక్ అసాధారణ ప్రతిభ చూపారు. చెన్నైలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఎస్కేయూ తరఫున ప్రాతినిధ్యం వహించి, గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. తనవద్ద క్రీడా, ఎన్‌సీసీ శిక్షణ పొందిన మురళీనాయక్, లోకేష్ నాయక్ ఆర్మీకి సెలెక్ట్ అయ్యారని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంజనేయులు.. 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. మురళీ నాయక్ వీరమరణం పొందటం బాధాకరమని అంజనేయులు ఆవేదన వ్యక్తంచేశారు.



మురళీనాయక్ ఇంటి వద్ద పోలీసులు, స్నేహితులు



పదో తరగతి గ్రూప్ ఫొటోలో మురళీనాయక్ (వృత్తంలో..)



స్నేహితుడి పెళ్లి సందర్భంగా బస్సులో మిత్రులతో కలిసి సెల్ఫీ..



తండాకొస్తే రోజంతా ఆటలే: సాయినాయక్, కళ్లితండా

స్నేహితుడు మురళీనాయక్‌తో 20 ఏళ్ల బంధం. మా తండాకు ఎప్పుడు వచ్చినా రోజంతా ఆటలతోనే గడిపేవాడు. రాత్రయినా తమతోనే ఉండేవారు. మూడు రోజుల క్రితం కూడా ఫోన్‌చేసి మాట్లాడారు. గ్రామంలో మంగళవారం జాతర జరిగింది. అదేరోజు వీడియోకాల్ చేసి మాట్లాడాడు. తాను రాలేకపోయాననీ, సెలవు ఇవ్వలేదనీ, అందరూ ఎంజాయ్ చేయండని చెప్పారు.



కొన్ని గంటల ముందే ఫోన్ చేశాడు: వినోద్‌నాయక్, కళ్లి తండా

మురళీనాయక్, నేను ఒకే రోజు పుట్టాం. అప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రాణస్నేహితులుగానే ఉన్నాం. వారంలో నాలుగైదుసార్లు ఫోన్‌లో మాట్లాడతాడు. ఆఖరిగా గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ మాటలు ఇప్పటికీ తలచుకుంటే ఏడుపు వస్తుంది.



మరువలేకపోతున్నాం: వేణుగోపాల్‌నాయక్, కళ్లి తండా

నా స్నేహితుడు మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలు విడిచాడని గర్వంగా ఉన్నా.. ఇక మాతో కలిసి తిరగడనే విషయం బాధ కలిగిస్తోంది. జాతరకు వస్తానని చెప్పి రాలేకపోయాడు. అలాంటి స్నేహితుడు దూరం కావడం దురదృష్టకరం.



చదువుకునే రోజుల్లోనే దేశం గురించి మాట్లాడేవాడు..

మురళీనాయక్ విజ్ఞాన్ పాఠశాలలో 1-10వ తరగతి వరకు చదివాడు. చదువుకునే రోజుల్లోనే దేశానికి సేవ చేయాలన్న ఆకాంక్ష ఉండేది. పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా దేశ సేవ గురించి మాట్లాడేవాడు. ఆర్మీలో చేరతానని చెప్పేవాడు. వీరమరణం పొంది భరతమాత ముద్దుబిడ్డ అయ్యాడు. మా పాఠశాల విద్యార్థి అని చెప్పుకోవడానికే గర్వపడుతున్నాం.

-మల్లికార్జున, కరస్పాండెంట్, విజ్ఞాన్ పాఠశాల, సోమందేపల్లి



రాత్రి ట్యూషన్ వదిలితే నా వెంట వచ్చేవాడు..

అవ్వ, తాత ఇంటి వద్ద ఉంటూ మురళీనాయక్ నాగినాయనిచెరువు తండా నుంచి సోమందేపల్లికి పాఠశాలకు వెళ్లేవాడు. రాత్రి ట్యూషన్ వదిలాక కాలినడకన వచ్చేవాడు. చాలాసార్లు నేను బైక్‌పై ఎక్కించుకుని వచ్చేవాడిని. ఈరోజు వీరమరణం పొందాడని తెలిశాక ఇలాంటి సైనికుడిని నా బైక్‌లో ఎక్కించుకుని వెళ్లానా.. అని గర్వంగా ఉంది.

- అంజనేయులు, నాగినాయనిచెరువు తండా



పెనుకొండలో మంత్రి సవిత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నివాళి



శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారుల నివాళి..



హిందూపురంలో కొవ్వొత్తుల ర్యాలీ



నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రత్న

జిల్లా రుణం తీర్చుకుంటా

(5వ పేజీ తరువాయి)

తెలిపింది. తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంది. బంగారు కుటుంబం కింద ఎంపికైనందున ఏదో సాయం చేసి వదిలేసేది లేదని, పిల్లలకు చదువులు, పక్కా ఇల్లు, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి మార్గదర్శిగా ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్త అనంతయ్య మాట్లాడుతూ పార్వతి భర్తకు సెక్యూరిటీ గార్డుగా తాను ఉద్యోగం ఇస్తానని, వారి పిల్లల చదువులకు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మరో మార్గదర్శి రామకృష్ణ గ్రామంలోని 15 కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించడంతో సభలో కరతాళధ్వనులు మిన్నంటాయి.



హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న సీఎం, మంత్రులు

ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించాలి

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించి, గడువులోపు పూర్తి చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఛాయాపురం గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంత మేరకు పనులు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కాలువలో నుంచే జరుగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు.

రాయలసీమ భాగ్యప్రదాత బాబు: పయ్యావుల

రాయలసీమ భాగ్యప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్ దేశ డ్రిప్ విధానాన్ని 30 ఏళ్ల కిందటే గుర్తించిన దార్శనికుడు చంద్రబాబు అని కొనియాడారు. డ్రిప్ విధానంతో వ్యవసాయంలో ఆ దేశం కొత్త పుంతలు తొక్కిందని గుర్తించి, ప్రత్యేక బృందాలను ఆ దేశానికి పంపి రాష్ట్రంలో డ్రిప్ సేద్యానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో రూ. 800 కోట్లతో మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు చంద్రబాబు అంకురార్పణ చేస్తే, జగన్ ఐదేళ్ల పాలనలో డ్రిప్ అనే మాటే వినపడకుండా చేశాడని విమర్శించారు. చంద్రబాబు 2014-19 మధ్య కాలంలో తన ప్రతి పుట్టినరోజుకు ఓ కొత్త ప్రాజెక్టును జిల్లాకు తెచ్చారన్నారు. గొల్లపల్లి రిజర్వాయరు, హెచ్చెల్సీ ఆధునికీకరణ, బీటీపీ, హంద్రీనీవా వైడెనింగ్, కియ పరిశ్రమ తదితర ప్రాజెక్టులు తెచ్చారన్నారు. హంద్రీనీవా వైడెనింగ్‌ను మూడు నెలల్లో పూర్తిచేస్తానన్న జగన్ ఐదేళ్లు గంప మన్నుకూడా ఎత్తలేదని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా కారణంగా సాగుభూముల ధరలు ఐదు రెట్లు పెరిగాయన్నారు. జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు రూ. 72 వేల కోట్లను కేటాయిస్తే, జగన్ రూ.22 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేశారన్నారు. రాయలసీమకు టీడీపీ ప్రభుత్వం రూ. 12,421 కోట్లను ఇస్తే, రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే జగన్ రూ. 2,011 కోట్లను కేటాయించి ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, సహాయ కలెక్టరు సచిన్ రహార్, హంద్రీనీవా సీఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీబీ చైర్మన్ ఎం కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టేబుల్ బుక్ కాపీ ఆవిష్కరణ

ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా టేబుల్ బుక్ కాపీని ఆవిష్కరించారు. సీఎం మాట్లాడుతూ జిల్లా టేబుల్ బుక్ అద్భుతంగా ఉందని అభివర్ణించారు. దీన్ని తయారు చేయడంలో జిల్లా కలెక్టర్ బాగా కష్టపడ్డారని అభినందించారు. జిల్లా వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, భౌగోళికం, పర్యాటకం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, ఇతర అంశాల కలబోత కాపీ బుక్ అని పేర్కొన్నారు. ఈ బుక్‌ను బెంగళూరుకు చెందిన బంక్‌ల్యాబ్ ప్రతినిధులు 128 పేజీలతో తయారు చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో సమాచారం సేకరించి బంక్ ల్యాబ్ ప్రతినిధులు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో మంతులు పయ్యావుల కేశవ్, రామానాయుడు పేర్కొన్నారు.

ఎంపీ 'అంబికా'కు సీఎం పరామర్శ

అనంతపురం అర్బన్: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సీఎం చంద్రబాబు ఫోన్ ద్వారా పరామర్శించారు. ఎంపీసోదరి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించగా, ఆయన బావ గాయపడ్డారు. డెహ్రాడూన్‌కు రెండు చార్టెడ్ ఫ్లైట్స్‌ను శనివారం పంపుతామని, ఒక దానిలో సోదరి మృతదేహం, మరోదానిలో బావను తీసుకొచ్చి హైదరాబాద్‌లో మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఎం సూచించారు. విపత్కర పరిస్థితుల్లో తన కుటుంబానికి అండగా నిలిచిన సీఎం చంద్రబాబుకు ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాను టాప్ 3లో నిలపాలి

- భూగర్భ జలాల పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం ఆదేశం



ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అనంతపురం మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లోనూ టాప్ 3లో నిలపడానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. ఆమేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వజ్రకరూరు మండలం ఛాయాపురంలో హంద్రీనీవా కాలువ పనుల విస్తరణ, లైనింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజావేదిక అనంతరం హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో చంద్రబాబు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ముందుగా వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూల మాల వేసి సీఎం శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయంలో డ్రోన్లు

ఇరిగేషన్‌కు సంబంధించి డ్రోన్లను భిన్నమైన టైమ్స్‌లో, డిఫరెంట్ లేయర్స్ పెట్టుకొని ప్రతి రోజు ఎంత పనికి వినియోగించామో చూసుకోవాలన్నారు. మ్యానువల్‌కు, డ్రోన్ వినియోగానికి తేడా ఉందా..? లేదో తెలుసుకోవాలన్నారు. ఐటీ టీం ద్వారా వీటిని ఎలా వినియోగించాలో తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకొని విజన్- 2047కు సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎవరికివారు నియోజకవర్గాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో గుర్తించాలన్నారు. ఆర్థిక పరంగానే కాకుండా మామూలుగా అయ్యే పనులు చాలానే ఉన్నాయని, వాటన్నింటినీ పూర్తి చేస్తే మంచి పేరు వస్తుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు కుటుంబానికి సంబంధించి దత్తత తీసుకోవాలన్నారు. ఆయా లబ్ధిదారులను గుర్తించి దత్తత తీసుకోవాలన్నారు. ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు అధికారులను నియమిస్తున్నామ న్నారు. జిల్లాలో ఉత్తమ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తామన్నారు. రాష్ట్రంలో 10వేల కిలో మీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.1.5లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పౌల్ట్రీ రంగం తక్కువ ఉందన్నారు. పారిశ్రామిక రంగం, సర్వీస్ సెక్టార్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులకు నీరు ఇస్తే భూగర్భజలాలు పెరుగుతాయని, ఇందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి శ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, జలవనరుల శాఖ సెక్రటరీ సాయిప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, భూగర్భజల శాఖ, డీఆర్‌డీఏ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు సన్నద్ధం

- శారదాస్కూల్‌లో ప్రత్యేక కేంద్రం
- 16 వేలకుపైగా టీచర్ల సీనియారిటీ జాబితా సిద్ధం

అనంతపురం విద్య, మే 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కల్పనకు ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఉత్తర్వులు రాగానే ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల కోసం అనంతపురం ఒకటో రోడ్డులో ఉన్న శారదా మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. కంప్యూటర్లను సిద్ధం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్ణయ్య సిబ్బందితో సమావేశమై.. బదిలీల ప్రక్రియతో నిర్వహణ, టెన్నికల్ టీమ్స్, ఇతర టీమ్స్ ఏర్పాటు గురించి చర్చించారు.

సెలవులు రద్దు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 వేల మందికిపైగా ఉపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు సిద్ధం చేశారు. చిన్నపాటి పొరపాట్లు, అభ్యంతరాలు ఉంటే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంది. చాలా వరకూ జాబితాను సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే ఫైనల్ సీనియారిటీ జాబితాలు ప్రకటించే అవకాశం ఉంది. స్కూళ్ల పునర్నిర్మాణం, టీచర్ పోస్టుల నియామకం, ఖాళీల వివరాలను డైరెక్టర్ నుంచి వచ్చే ఆదేశాల మేరకు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. త్వరలో బదిలీలు, ప్రమోషన్ల నిర్వహణకు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉండటంతో, శని, ఆదివారాల్లో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని కమిషనర్ విజయరామరాజు, ఆర్‌జేడీ శామ్యూల్ ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అత్యవసరం అయితే తప్ప సెలవులు తీసుకోకూడదని, నిత్యం అందుబాటులో ఉండాలని సూచించినట్లు సమాచారం.



టీమ్స్ ఏర్పాటుపై అధికారులకు ఆదేశాలిస్తున్న డీఈఓ

రానున్న ఐదు రోజులకు వర్షసూచన



బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. ఈదరుగాలులు ఆగ్నేయం దిశగా గంటకు 8 కి.మీ, నుంచి 13 కి.మీ, వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు పశువులు, మేకలు, గొర్రెల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. వరికోతలు ఉన్న రైతులు వాతావరణానికి అనుకూలంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ


అయ్యప్ప స్వామి మూల విరాట్‌కు జలాభిషేకం చేస్తున్న బ్రహ్మదత్త తంత్రి

బుక్కరాయసముద్రం, మే 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయం ప్రారంభోత్సవంతోపాటు అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. కేరళలోని శబరిమల ఆలయం శైలిలో దాదాపు రూ. 3 కోట్ల వ్యయంతో ఇక్కడ నూతనంగా అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించారు. ఆరు రోజుల నుంచి దేవాలయంలో శబరిమల ప్రధాన అర్చకుడు బ్రహ్మదత్త తంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గురువారం బ్రహ్మముహూర్తాన ఆలయంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం గణపతి, కాలభైరవుడు, మాలికపు రత్తమ్మ, దక్షిణామూర్తి, శివుడు, విష్ణువు, ఆంజనేయస్వామి, నాగులు, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు వేలాది మంది తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. స్వామి వారి ప్రతిష్ఠ సందర్భంగా ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు సాకే శైలజానాథ్, యామినీబాల, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాయకులు పర్వతనేని శ్రీధర్‌బాబు టీడీపీ నేతలు అశోక్, పసుపుల శ్రీరామిరెడ్డి, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, కొప్పల మీనాక్షమ్మ ఫౌండేషన్ చైర్మన్ రవికాంత్ రమణ, టీడీపీ మండల కన్వీనర్ అశోక్ తదితరులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అనంత ఆస్పత్రిని 1200 పడకలకు పెంచండి

● సీఎంకు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి


సీఎంను కలిసి విన్నవిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని 1200 పడకలకు పెంచాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కోరారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం హెలిప్యాడ్ వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి సీఎంకు స్వాగతం పలికారు. ఇదే క్రమంలో పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం సర్వజనాస్పత్రికి కేవలం 560 పడకల సామర్థ్యం ఉందని, రోగుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో 1200 పడకలకు పెంచాలని కోరారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, క్యాన్సర్ ఆస్పత్రుల నిర్వహణ భారంగా ఉందని, వీటిపై తగు నిర్ణయం తీసుకొని చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంపీఆర్ కాలువ ఆధునికీకరణ చేపట్టండి

● సీఎంను కోరిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


సమస్యలపై సీఎంకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, మే9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మిడ్‌పెన్నార్ కాలువ ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. హంద్రీనీవా తొలి దశ పనుల పరిశీలన కోసం శుక్రవారం ఉరవకొండకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే కలిసి వినతి పత్రాలు అందజేశారు.

పద్మశాలీ భవనానికి స్థలం కోసం వినతి

అనంతపురం అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్షకుపైగా జనాభా కలిగిన పద్మశాలిలు సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు భవనం కోసం స్థలం కేటాయించాలని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు కోరారు. శుక్రవారం ఛాయాపురం హెలిప్యాడ్ వద్ద ఇతర కార్పొరేషన్ల డైరెక్టర్లు పరమేశ్వరన్, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తిలతో కలిసి సీఎంకు స్వాగతం పలికారు. ఇదే క్రమంలో పలు అంశాలపై సీఎంకు వినతి పత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి


రవీంద్రనాయుడు (ఫైల్)

గార్లదిన్నె, మే 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లోలూరు రవీంద్రనాయుడు (51) అనే టీడీపీ కార్యకర్త మృతి చెందాడు. పాతకల్లూరు చెందిన లోలూరు రవీంద్ర నాయుడు, లక్ష్మీదేవి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. రవీంద్రనాయుడు గురువారం సాయంత్రం పనినిమిత్తం కుమారుడు భార్గవ నాయుడుతో కలసి పామిడికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. కల్లూరు సమీపంలో వినాయక రైస్‌మిల్ వద్ద కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో రవీంద్రనాయుడుకు తీవ్రగాయాలు కాగా, భార్గవ నాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవీంద్రనాయుడు పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహాల మేరకు కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెనకచెర్ల వద్ద మరొకరు...

● గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్ల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామసుబ్బయ్య (46) అనే వ్యక్తి మృతి చెందాడు. పెనకచెర్లకు చెందిన రామసుబ్బయ్య కూలీ పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకునేవాడు. శుక్రవారం కోటంకలో జరుగుతున్న బంధువుల వివాహానికి కుమారుడు గణేష్‌తో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. కోటంక నుంచి తిరిగి స్వగ్రామానికి తిరిగివస్తుండా పెనకచెర్ల సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో రామసుబ్బయ్య తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.


కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేస్తున్న ఆర్‌ఈఎఫ్ నాయకులు



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వీరజవానుకు అశ్రునివాళి

అనంతపురం క్లాక్‌టవర్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ దేశం కోసం చేసిన సేవలు వెలకట్టలేనివని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కొనియాడారు. పాకిస్థాన్‌తో జరుగుతున్నయుద్ధంలో వీరమరణం పొందిన వీరజవాను మురళీనాయక్‌కు ఆర్‌ఈఎఫ్ నాయకులు అశ్రు నివాళులర్పించారు. వీరజవాన్ ఆత్మకు శాంతి కలగాలని శుక్రవారం సాయంత్రం స్థానిక జెడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్, నాయకులు నాగభూషణం, రాజారమేష్, ఓబుళేసు, రాజశేఖర్, నారాయణప్ప, మల్లికార్జున, సాంబ శివమ్మ, శ్రీరాములు, సురేష్, శ్రీనివాసులు, గోవిందనాయక్, ఏ నాగభూషణం, ఆదినారాయణ, వరదరాజులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మురళి త్యాగాన్ని దేశం మరచిపోదు: సీపీఎం నాయకులు

● అనంతపురం కల్చరల్: వీర జవాన్ మురళి నాయక్ ప్రాణత్యాగాన్ని దేశం మరచిపోదు అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన మురళి నాయక్ మృతికి సంతాపంగా శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. **దేశ సరిహద్దుల్లో సైనికుల పోరాటాలు, ప్రాణత్యాగలకు ఎవరూ వెలకట్టలేరని పేర్కొన్నారు. మురళీనాయక్ వీరమరణం వృథా కాదన్నారు.** సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వెంకట నారాయణ, వలి, ప్రకాష్, ముత్తుజా, నాయకులు రాజు, ఎన్టీఆర్ శీణా, ఆదినారాయణ, ఆజాం, నాగరాజు, శంషాద్, పీటీసీ వాకర్స్ అసోసియేషన్ నాయకులు శివప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

● అనంతపురం విద్య: దేశసరిహద్దుల్లో పోరాటంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక ఆర్ట్స్ కాలేజ్ నుంచి క్లాక్ టవర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఆ సంఘం పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి, పూర్వపు జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. **అతి చిన్నవయసులోనే మురళి నాయక్ ప్రాణాలు కోల్పోవడం ఆయన కుటుంబానికి తీరని లోటు అన్నారు. మురళి నాయక్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.** జిల్లా సహాయకార్యదర్శి చందు, నగర అధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి నాని, ఇతర అధికారులు సమీర్, ప్రభాస్, సబ్జాన్, తౌకిర్, మురళి, మెహది, వరుణ్, తరుణ్, సుఫియాన్, చరణ్, బాబ్జాన్, యశ్వంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్: యుద్ధంలో వీరమరణం పొందిన మురళీ నాయక్‌కు ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంఘం జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్, హనుమంతరావు, రమేష్, నాగభూషణం, కిష్టప్ప, ఎమ్మెస్సీ నాయకులు కదరిప్ప పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, రామకష్ణ. జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భవాని రవికుమార్ తదితరులు, జిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో కెప్టెన్ షేకన్న, ట్రెజరర్ తిమ్మారెడ్డి, కరణం కృష్ణ, హుస్సేన్, సుహేల్, రాజగోపాల్, వెంకటరమణ, శ్రీనివాసులు, బాలస్వామి తదితరులు పాల్గొని వీరజవాన్ మురళినాయక్ మృతికి ఘన నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికుల సంఘం నాయకులు

వీరజవాను కుటుంబానికి ఆర్థిక సాయం


వీరజవాను తండ్రి శ్రీరామ్‌నాయక్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్/రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ దేశం కోసం చేసిన సేవలు వెలకట్టలేనివని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, జిల్లా విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ రవిశంకర్ కొనియాడారు. మురళీనాయక్ కుటుంబాన్ని శుక్రవారం రవిశంకర్ పరామర్శించారు. తన వంతుగా రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

శ్రీవాణి విద్యాసంస్థల దిగ్భ్రాంతి


ఎన్‌సీసీలో సహ కేడెట్లతో మురళీ నాయక్

అనంతపురం కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి):వీర జవాన్ మురళి నాయక్ మృతిపట్ల శ్రీవాణి విద్యాసంస్థల సీఈఓ సుధాకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనజమ్మ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాణి శుక్రవారం సంయుక్త ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మురళి నాయక్ శ్రీవాణి కళాశాలలో 2021-22 బ్యాచ్‌లో బీకాం పూర్తి చేయడంతోపాటు ఎన్‌సిసిలో పాల్గొన్నాడన్నారు. క్రీడల్లోనూ చాలా బహుమతులు పొందాడని తెలిపారు. డిగ్రీ మూడో సంవత్సరంలోనే ఆర్మీలో చేరి తోటి విద్యార్థులందరినీ ఆశ్చర్యపరిచాడన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

అమర జవానుకు పలువురి సంతాపం

అనంతపురం కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ సైన్యం కాల్పుల్లో మరణించిన వీరజవాన్ మురళినాయక్ మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. మురళినాయక్ చదువుకునే రోజుల్లోనే ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడన్నారు. చిన్నవయసులోనే దేశంకోసం ప్రాణాలర్పించిన మురళినాయక్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

● అనంతపురం న్యూటౌన్: వీర జవాను మురళీనాయక్ యుద్ధ భూమిలో ప్రాణాలు కోల్పోయాడన్న సమాచారం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరమరణం పొందిన మురళీనాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మురళీనాయక్ కుటుంబానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు విఘాతం తగదు

● కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు విఘాతం కలిగించడం తగదని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ... ప్రభుత్వం తొమ్మిది రకాల స్కూళ్లు ఏర్పాటు చేస్తే విద్యారంగం తీరని ఒత్తిడికి గురవుతోందన్నారు. సంఘం రాష్ట్ర పూర్వపు నాయకులు రఘురామిరెడ్డి, నరసింహులు మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, మూడు పెండింగ్ డీఏల సాధనకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. నెల 14న విజయవాడలో ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. తర్వాత కలెక్టర్‌లో ఏవో అలెగ్జాండర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.




బాధిత కుటుంబానికి సీఎం భరోసా

● సీఎంఆర్ఎఫ్ కింద రూ.12 లక్షల చెక్కు పంపిణీ

గార్లదిన్నె, మే 9(ఆంధ్రజ్యోతి): విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్న వారి బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. మండలంలోని యర్రగుంట్లకు చెందిన నిమ్మకాయల సురేష్, సుజాత దంపతులు గార్లదిన్నెలో కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. కుటుంబ కలహాలతో గత ఏడాది డిసెంబరు 12న తల్లి సుజాత, కుమారుడు నాగచైతన్య, కుమార్తె రాహిత్యకు విషపు గుళికలు మింగించి తాను ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో తల్లి సుజాత, కుమారుడు నాగచైతన్య మృతి చెందగా కుమార్తె చికిత్స పొందుతూ ప్రాణపాయం నుంచి బయటపడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో సీఎం చంద్రబాబు బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి ద్వారా రూ. 12 లక్షలు మంజూరు చేశారు. ఆ చెక్కును ఎమ్మెల్యే శ్రావణి శ్రీ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు సురేష్, రాహిత్యకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నిమ్మకాయల ఈశ్వరయ్య, పరంధా, అనిల్, రామయ్య ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలవేరు వీరనాగమ్మ ఉత్సవాలు

అనంతపురం రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లిలో వెలసిన పాలవేరు వీర నాగమ్మ ఉత్సవాలు ప్రతి ఏటా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. శనివారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉమ్మడి అనంత జిల్లాతో పాటు పక్కల జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామీణ క్రీడలు నిర్వహించ నున్నారు. తొలిరోజు ఇరుసు ఎత్తు పోటీలు, రెండో రోజు క్యాటగిరి ఎద్దులచే రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించున్నారు. చివరిరోజు సీనియర్ ఎద్దులచే రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు గ్రామస్థులు తెలిపారు.




ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి , శ్రీధర్ చౌదరి, రామలింగారెడ్డి

సీఎంకు పలువురి స్వాగతం

అనంతపురం అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ జిల్లా ముఖ్య నాయకులు శుక్రవారం ఛాయాపురం హెలిప్యాడ్‌లో కలిసి స్వాగతం పలికారు. ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రామలింగారెడ్డి, గాజుల ఆదెన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు.. చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.





స్వాగతం పలుకుతున్న గాజుల ఆదెన్న, గౌస్‌మొద్దీన్, ఆలం నరసానాయుడు, పూల నాగరాజు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు


పూజాసామగ్రిని తీసుకొస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

కనగానపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తవకుంట్ల గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గ్రామంలో పురాతనమైన రామాలయ స్థలంలో గ్రామస్థుల ఐకమత్యంతో దాదాపు రూ. 50 లక్షల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ముత్తవకుంట్లలోని రామాలయం దివంగత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కుటుంబానికి సెంటుమెంటు. వారు ఏ కార్యక్రమాన్నైనా ఇక్కడే నుంచే మెదలు పెట్టడం ఆనవాయితీ. దీంతో ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కోసం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను, జయ, విజయుల విగ్రహాలను అందజేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎల్ నారాయణచౌదరి కుటుంబసభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు, సర్పంచ్ అంజి, రామంజి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎ. నారాయణపురంలో...


ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

అనంతపురం కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని ఎ. నారాయణపురం గ్రామంలో శుక్రవారం హనుమద్ సమేత సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ శుక్రవారం విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రాణప్రతిష్ఠ చేశారు. అలాగే ఆలయం ధ్వజస్తంభం, ఆలయ గోపుర కలశప్రతిష్ఠను నిర్వహించారు. పెద్దఎత్తున అన్నసంతర్పణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం పోరాటాలు చేద్దాం: శైలజానాథ్

అనంతపురం సెంట్రల్, మే 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సేవాదీప్తి అయిన ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రజల భాగస్వామ్యంతో పోరాటాలకు సిద్ధమవుదామని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం కమిటీ కన్వీనర్ సాకేహరి అధ్యక్షతన వహించిన రిలే దీక్షలకు సంఘీభావంగా డాక్టర్ శైలజానాథ్ పాల్గొని మద్దతు తెలిపారు. బేడ, బుడగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి, ఎస్సీ సంక్షమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చామలూరు రాజగోపాల్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్, మాజీ జడ్పీటీసీ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఇతర సంఘాల నాయకులు బీకేఎస్ ఆనంద్, అరుణక్క, తనీషా, నాగేంద్ర, మల్లి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

అనంతపురం సెంట్రల్, మే 9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ డిగ్రీ కళాశాలలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

● పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు





సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్



వెండిపళ్లెంను జ్ఞాపికగా అందజేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఉరవకొండ/తాడిపత్రి, మే 9(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు నా యుడు శుక్రవారం వచ్చారు. హెలిప్యాడ్ వద్ద ఆయనకు ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశ వ్, ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్ తదితరులు పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అలాగే ఎంఎల్ఏలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, జేసీ అశ్మిత్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూలనాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ మంటి మడుగు కేశవరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తదితరులు సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

గుంతకల్లుకు మంత్రి రామానాయుడు..

గుంతకల్లుటౌన్: సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు విజయవాడ నుంచి రైలులో శుక్రవారం ఉదయం గుంతకల్లు పట్టణానికి చేరుకుని స్థానిక కోసిగి రైల్వే గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ మంత్రిని కలెక్టర్ వినోద్‌కుమార్, గుంతకల్లు, కల్యాణదుర్గం ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. తర్వాత ఛాయపురానికి ఎమ్మెల్యేలతో కలిసి బయలుదేరి వెళ్లారు.

బీటీపీ కాలువ పనులను పునఃప్రారంభించాలి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే అమిలినేని విన్నపం




సీఎంతో ఎమ్మెల్యేలు అమిలినేని, గుమ్మనూరు

కళ్యాణదుర్గం, మే 9 (ఆంధ్రజ్యోతి): బీటీపీ కాలువ పనులను త్వరలోనే పునః ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను పరిశీలించేందుకు గాను సీఎం వజ్రకరూరు మండలం ఛాయాపురానికి శుక్రవారం వచ్చారు. దీంతో ఎమ్మెల్యే అమిలినేని ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం జీవనాడి అయిన బీటీపీ కాలువ పనులను పునః ప్రారంభించి రైతుల కళ్లల్లో ఆనందం నింపాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో పలు ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా సీఎంకు నివేదిక అందజేసినట్లు ఆయన చెప్పారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యే జయరాం వినతి

గుంతకల్లు: వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద సీఎం చంద్రబాబును గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కలిసి పలు అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించారు. హంద్రీనీవా 174.4 కి.మీ. వద్ద రాగులపాడు సమీపం నుంచి కాల్వను తవ్వి 12 చెరువులకు నీరిచ్చే ప్రాజెక్టుకు రూ.40.70 కోట్లు మంజూరయ్యాయని, కానీ పనులు ప్రారంభించలేదని తెలిపారు. ఆ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పామిడి-గుంతకల్లు, గుత్తి-కసాపురం, గుంతకల్లు-మద్దికెర రహదారులు సింగిల్ వేగా ఉన్నాయని, వాటిని డబుల్ రోడ్లుగా మార్చాలని తెలియజేశారు. నియోజకవర్గంలోని 107 గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి రూ. 250 కోట్ల సీపీడబ్ల్యూఎస్ నిధులను మంజూరుచేయాని, గుంతకల్లు మునిసిపాలిటీలో తాగునీటి కోసం హంద్రీనీవా నుంచి అధికారికంగా నీటి కేటాయింపు చేయాలని, గుంతకల్లులో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్ల నిర్మాణం కోసం రూ. 102 కోట్ల నిధులు కేటాయించాలని సీఎంకు ఎమ్మెల్యే జయరాం విన్నవించారు.

అగ్నివీర్ మురళీనాయక్‌కు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజలు

కళ్యాణదుర్గం రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇండియా-పాకిస్థాన్‌కు జరుగుతున్న యుద్ధంలో గురువారం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు అగ్నివీర్ సైనికుడు మురళీ నాయక్ వీరమరణం పొందారు. ఇందుకు గాను పట్టణంలోని విశ్వహిందూపరిషత్ నాయకులు శుక్రవారం సాయంత్రం ఘన నివాళులు అర్పించారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత గిరిజన ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

మురళీనాయక్ ధైర్యసాహసాలు గర్వకారణం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్



గుంతకల్లుటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా భారత్‌కు, పాకిస్థాన్‌కు జరుగుతున్న యుద్ధంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళీనాయక్ చూపిన ధైర్య సాహసాలు గర్వకారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీ.జగదీష్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కాగా పాక్ సైనికుల కాల్పుల్లో అతను ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. పాక్ సైనికులను తిప్పికొట్టే ప్రయత్నంలో మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. మృతికి సీపీఐ రాష్ట్ర సమితి తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు చెప్పారు.

మహాసభలను విజయవంతం చేయండి: సీపీఐ

గుంతకల్లు టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 11వ తేదీన జరిగే సీపీఐ 4వ మండల మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రాము కోరారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చే స్తున్న ఈ సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్, జాల్లా సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్ హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు, రైతులు పెద్దఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల సహా య కార్యదర్శి రామాంజ నేయులు, నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



శాస్త్రవేత్తలకు సూచనలిస్తున్న శివనారాయణ

కళ్యాణదుర్గం, మే 9 (ఆంధ్రజ్యోతి): భూములను సారవంతం చేయడంతో పాటు, పంటల్లో చీడ పురుగులను పూర్తిగా నివారించేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ.శివనారాయణ సూచించారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతులను అనుసరించి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అలాగే ప్రస్తుతం రైతులు భూసార పరీక్షలు, నీటి పరీక్షలు చేయించుకునేలా శిక్షణలతో.. సామాజిక చర్చలతో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేవీకే సమన్వయ కర్త డాక్టర్ చంద్రాయుడు, శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, మల్లికార్జున, శిరీష హరిణి, యుగంధర్, బోధనేతర సిబ్బంది, ఎస్‌ఎస్ అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గుత్తి, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు టీడీపీ లీగల్ సెల్ నాయకుడు సోమశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, నాయకులు చికెన్ శీనా, నాగరాజు, బండలప్రసాద్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లు చెల్లించండి

శెట్టూరు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగదారులు ఇకపై క్యూఆర్ కోడ్ సాయంతో విద్యుత్ బిల్లును చెల్లించవచ్చునని విద్యుత్ ఏఈ సలీమ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బిల్లు పేపర్‌పై వచ్చే క్యూఆర్ కోడ్ సాయంతో అత్యంత సులువుగా బిల్లు చెల్లించొచ్చని, వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరణ ధ్రువీకరణ పత్రం కోసం ప్రదక్షిణ



భర్త మరణ ధ్రువీకరణ పత్రం కోసం పాట్లు పడుతున్న నాగలక్ష్మి

శెట్టూరు, మే 9(ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయి పుట్టెడు బాధలో ఉన్న ఓ మహిళ మరణ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ మానసికంగా కుంగిపోతోంది. మండల పరిధిలోని కైరేవు గ్రామానికి చెందిన గోవిందప్ప గత యేడాది సెప్టెంబరు 19వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణ ధ్రువీకరణ పత్రం కోసం భార్య నాగలక్ష్మి తన బిడ్డలతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. నెలలు గడుస్తున్నా సచివాలయ సిబ్బంది మరణ ధ్రువీకరణ పత్రం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని బాధితురాలు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవాయి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పాలవాయికి చెందిన శ్రీకృష్ణ (21), వెంకటేశ్, దుర్గేశ్ గ్రామంలోనే బొలేరో వాహనంలో మామిడికాయలు లోడ్ చేసుకుని కళ్యాణదుర్గంకు బయలుదేరారు. అయితే గ్రామ సమీపంలోని ప్రధానరోడ్డువద్దకు రాగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని పక్కన నిలిపి స్టెప్నీ మారుస్తున్నారు. అయితే కళ్యాణదుర్గం నుంచి పాలవాయికి వస్తున్న ఓ కారు నిలిచిఉన్న బొలేరో వాహనాన్ని వేగంగా ఢీ కొంది. ప్రమాదంలో ఆ వాహనం వద్ద ఉన్న శ్రీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా.. వెంకటేశులు, దుర్గేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. వారు కారు అక్కడే వదిలేసి పరారయ్యారు. గాయపడ్డ వారిని స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు గుంతకల్లు విద్యార్థి



గాదిలింగను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

గుంతకల్లు టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెలగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి గాదిలింగ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. విద్యార్థిని వైస్‌ప్రిన్సిపాల్ రవిశంకర్‌శర్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు అభినందించారు.

బండిశూల తిరునాళ్లలో ఎమ్మెల్యే గుమ్మనూరు



బండిశూల రథోత్సవంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



పెద్దవడుగూరులో ఊరేగింపులో పాల్గొన్న జేసీపీఆర్

పామిడి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామరాజుపల్లిలో జరుగుతున్న బండిశూల తిరుణాలలో శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి సుంకులమ్మ, ముత్యాలయ్య స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆనందోత్సాహాల నడుమ ఏడు కాండ్ల ఎద్దులతో బండిశూల రథోత్సవాన్ని ప్రారంభించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పామిడి సీఐ యుగంధర్ తన సిబ్బందితో తగిన చర్యలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎద్దుల ఊరేగింపులో పాల్గొన్న జేసీపీఆర్

పెద్దవడుగూరు: బండిశూల తిరుణాల సందర్భంగా మండలకేంద్రంలో రైతులు తమ ఎద్దులను ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేశారు. ఈ తిరుణాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించుకోవాలని, ఎవరూ ఘర్షణలకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నాయకులు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

రాయదుర్గం, మే 9(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధులకు సమయానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ శిల్ప సూచించారు. పట్టణంలోని కోటవీధి 13వ సచివాలయంను శనివారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా అక్కడి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అందరూ సక్రమంగా విధులకు హాజరుకావాలని, కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. అలాగే సచివాలయంలో జరుగు అన్ని కార్యక్రమాలను ఆయా కౌన్సిలర్లకు ముందుగా తెలియపరచాలని చెప్పారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌చార్జి గోల్డ్ ఇస్మాయిల్, వార్డు కౌన్సిలర్లు చన్నవీరస్వామి, వార్డు ఇన్‌చార్జిలు రామాంజినేయులు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

కణేకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం హనుమక్క అనే మహిళా రైతుకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. తనకున్న మూడు ఎకరాల పొలంలో రూ.90 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేశానని, మరికొద్దిరోజుల్లో పంట చేతికొస్తుందనగా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగిందని, దీంతో పంట కాలిపోయిందని బాధితురాలు వాపోయారు. యర్రగుంట్ల గ్రామంలోని బోయ వంద్రప్పకు చెందిన వరిగడ్డి దగ్ధం కాగా దాదాపు రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

ఎంపీడీఓగా సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ

కంబదూరు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొన్నేళ్ల నుంచి ఇక్కడ ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. ఇప్పుడు సూర్యనారాయణ రాకతో ఆ సమస్య తీరింది. ఆయన కర్నూలు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

అందని ద్రాక్షలా.. విలేజ్ క్లీనిక్‌ల వైద్యం

● గోనేహాళ్‌లో మధ్యాహ్నం 2 గంటలకే మూత



గోనేహాళ్‌లో మధ్యాహ్నానికే మూతపడ్డ విలేజ్ హెల్త్ క్లినిక్

బొమ్మనహాళ్, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు విలేజ్ క్లీనిక్‌ల వైద్యం అందని ద్రాక్షలా మారింది. గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉంచాలనే ఆశయంతో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. అయితే అవి ఆశించనంత ఫలితాలు ఇవ్వడం లేదు. మండలంలోని గోనేహాళ్ గ్రామంలో ఉన్న విలేజ్ క్లీనిక్‌ను శుక్రవారం మధ్యాహ్నం ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా 2గంటలకే సిబ్బంది తాళాలు వేశారు. ఇక్కడ 12 రకాల వైద్య సేవలతో పాటు 14 రకాల వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించాల్సి ఉంది. అయితే ఇవేవీ జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్న వారి ఇళ్లకు వైద్యసిబ్బంది వెళ్లి వైద్యం అందించాల్సి ఉంది. అవి కూడా అమలు కావడం లేదని తెలిసింది. మండల వ్యాప్తంగా అనేక చోట్ల ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు అంటున్నారు. వీటిని బట్టి చూస్తే విలేజ్‌క్లీనిక్‌ల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని అర్థమవుతోంది. ఇప్పటికైనా వారు దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిశోరి వికాసంపై అవగాహన

గుంతకల్లుటౌన్/రాయదుర్గం/బొమ్మనహాళ్/కణేకలు, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతీనగర్, ఎన్ఎస్‌బీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ అధికారిణి ఎం.వెంకటేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచాలని, పౌష్టిహారం తీసుకోవాలని తెలిపారు. అలాగే బాల్య వివాహాలపై కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలం మెచ్చిరి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, బొమ్మనహాళ్ మండలం కొళగానహళ్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత, కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి కిశోరబాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

తాడిపత్రి, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లో శుక్రవారం ఓ ఆటోడ్రైవర్‌పై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. పోలీసులు తెలిపిన మేరకు వివరా లిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ మహమ్మద్ ఆటో బాడుగ కోసం ఆటోనగర్‌కు వెళ్లాడు. అక్కడ ప్రయాణికులను దించి వెనక్కి వస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు అడ్డగించి దుర్భాషలాడుతూ దాడిచేసి గాయపరిచారు. కాగా దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

యాచకుడి మృతి

తాడిపత్రి, మే9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక కల్యాణమండపం సమీపంలో శుక్రవారం 55 ఏళ్ల గుర్తు తెలియని యాచకుడు మృతి చెందినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. అతను స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణ స్వామి, సాయిబాబా ఆలయాల వద్ద యాచిస్తూ జీవనం గడిపేవాడన్నారు. అయితే ఉన్నట్టుండి మృతి చెందాడని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



గౌతమి

కంబదూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులుప్రతిభ ను కనపరిచారు. శుక్రవారం విడుదలైన ఈ ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు నవ్య, గౌతమి సత్తా చాటి బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సీటు సాధించారు. నవ్య 50 మార్కులకుగాను 44, గౌతమి 50కి గాను 43 మార్కులు సాధించారు. వారిని హెచ్ఎం జయలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు.

వాసవీ అమ్మవారికి లక్ష పుష్పార్చన



అమ్మవారికి లక్ష పుష్పార్చన చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): జయంత్యుత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారికి శుక్రవారం లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని ఉంచి 108 జంటల దంపతులచేత వివిధ రకాల పుష్పాలతో అర్చన చేయించారు. సాయంత్రం విజయ విఠల భజన మండలి సభ్యులు పురంధరదాసు కీర్తనలు పాడారు. భగవద్గీత భక్తమండలి సభ్యులు భగవద్గీత పారాయణం చేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తిని వెండి రథంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపా జగదీష్, కార్యదర్శి కృపాకర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జయరాం



అధ్యక్ష,కార్యదర్శులను సన్మానిస్తున్న న్యాయవాదులు

గుంతకల్లుటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీ. జయరాం ఎన్నికయ్యారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పోటీకి ఏజీపీ హేమాద్రి, బీ.జయరాం పోటీపడ్డారు. హేమాద్రిపై ఆరు ఓట్లతో జయరాం గెలిచారు. సెక్రటరీ స్థానానికి శ్యామల, రమేష్ పోటీ పడగా 35ఓట్లతో రమేష్ గెలిచారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చంద్రశేఖర్, స్పోర్ట్స్ సెక్రటరీగా తిమ్మప్ప ఎన్నికయ్యారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా సీ వెంకటేశ్వర్లు, అడిషినల్ ఎలక్షన్ ఆఫీసర్‌గా వీరవరప్రసాద్ వ్యవహరించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులకు పలువురు న్యాయవాదులు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం న్యాయాధికారి మంజులను నూతన బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బీఎస్ కృష్ణారెడ్డి, నాయకులు మహమ్మద్‌యూనుస్, నాగరాజు, ఈదురువలి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

గుత్తి, మే 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుత్తి తాలూకా ఎన్నికలను శనివారం సాయంత్రం 4గంటలకు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా జిల్లా సహ అధ్యక్షుడు వేణుగోపాల్, సహాయ అధికారిగా కేసీ నాగరాజును నియమించామన్నారు. గుత్తి తాలూకాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

గుంతకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి-నిజామాబాద్-తిరుపతి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12793/94) రైళ్లను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో నిలిచిన ఈ రైళ్లలో ప్రయాణికుల వసతులను డీఆర్ఎం పరిశీలించారు. కోచ్‌లలో పారిశుద్ధ్యం, టాయిలెట్ల నిర్వహణ, రైలులోని ఎలక్ట్రికల్ ప్యానళ్లను తనిఖీ చేశారు. రైలులో ప్రయాణికుల భద్రతకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ తీసుకున్న చర్యలపై సమీక్షించారు.